# అత్యధిక ఓటింగ్ అతివలదే..

- **86.88 శాతం మంది మహిళల ఓటు హక్కు వినియోగం**

దస్తురాబాద్,డిసెంబర్ 2 : మండల పరిధిలో గురువారం జరిగిన పోలింగ్‌లో అతివలే పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో 12 వేల 705 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 6,199 మంది, స్త్రీలు 6, 505 మంది ఉన్నారు. వీరిలో 10,333 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 81.33 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం పురుషులు 6199 మంది ఉండగా వీరిలో 4,681 మంది తమ ఓటును వేశారు. అలాగే మొత్తం స్త్రీలు 5,652 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే 971 ఎక్కువ మంది మహిళ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో వారి ఓటింగ్ 86.88 శాతం నమోదైంది.



దస్తురాబాద్ : ఓటు వేయడానికి క్యూ లైన్లో నిల్చున్న మహిళా ఓటర్లు

## ఎన్నికల కౌంటింగ్‌పై సిబ్బందికి శిక్షణ

నిర్మల్ టౌన్, డిసెంబర్ 2 : ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించే అధికారులకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నారు. ప్రతి నియోజకవర్గంలో కౌంటింగ్ కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నట్లు 22 రౌండ్ల వారీగా ఫలితాలను వెలువడనున్నందున ప్రతి రౌండ్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ఈవీ ఎంల లాక్ ఓపెనింగ్, పార్టీ అభ్యర్థుల ఓటింగ్, ఫాం ధ్రువీకరణ, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు వివరాలను అప్‌లోడ్ చేయాలని వారు సిబ్బందికి సూచించారు. ఈ శిక్షణను జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు.


దస్తురాబాద్ : మైక్ ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

## విజయోత్సవ ర్యాలీలు నిషేధం

దస్తురాబాద్, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల లెక్కింపు ఉన్నందున ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మండలంలో విజయోత్సవ ర్యాలీలు, వేడుకలపై నిషేధం విధించినట్లు ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలం లోని గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు, వేడుకలపై నిషేధంపై ఆటో ద్వారా ప్రచారం చేశారు. 30 పోలీస్ సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎలాంటి ర్యాలీలు, సభలు సమావేశాలు, బైక్ ర్యాలీలు నిర్వహించడం, పటాకులు, డీజేలు పెట్టడం నిషేధమని ఎస్ఐ పేర్కొన్నారు. ఇద్దరి కన్న ఎక్కువ మంది రోడ్డుపై ఉండవద్దని, గెలిచిన అభ్యర్థులు, కార్యకర్తలు, నాయకులు నిబంధనలను పాటించాలని సూచించారు. లేని యెడల ఒక వేళ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**పెంబిలో..**

పెంబి, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఏ అభ్యర్థి గెలిచినా మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఎలాంటి ర్యాలీలు, డీజే సౌండ్ ఏర్పాటు, పటాకులు పేల్చడం, బైక్ ర్యాలీలు, నిషేధమని ఎస్ఐ రజినీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సూచించారు. ఒక వేళ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు

- **297 గ్రామాలకు ప్రతి రోజూ నీటి సరఫరా**
- **రూ. 280 కోట్లతో ఐదు మండలాలకు తీరిన ఇబ్బందులు**

కడెం, డిసెంబర్ 2 : కడెం జలాశయం నుంచి ఐదు మండలాల ప్రజలకు తాగునీరు అందించాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరింది. గతంలో వేసవికాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు కోట్ల రూపాయల నిధులు వెచ్చించింది. మిషన్ భగీరథ పథకం కింద ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చేందుకు శ్రీకారం చుట్టి ఆ దిశగా కడెంలో పనులు పూర్తి చేశారు. కడెం మండలంతో పాటు, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండలాల్లోని 297 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ. 280 కోట్ల నిధులతో నిర్మాణ పనులు పూర్తి చేసి, ఇబ్బందులు తీర్చారు. కడెం జలాశయంలో ఇంటెక్‌వెల్ నిర్మించి దాని ద్వారా మంచినీటి శుద్ధి కేంద్రానికి(ఫిల్టర్‌బెడ్) వరకు పైప్‌లైన్ అమర్చి నీటిని అందిస్తున్నారు. అయితే మొదటి విడుతగా రూ. 30 కోట్ల ద్వారా శుద్ధజల ప్లాంట్ నిర్మాణం పనులను చేపట్టారు. రెండో విడుతలో రూ. 250 కోట్లతో ఇంటెక్‌వెల్ నిర్మాణంతో పాటు ఐదు మండలాల్లోని గ్రామాలకు పైపులను అమర్చి, ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందించేలా ట్యాంకులు, పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. ఇక్కడ నిర్మించిన ఫిల్టర్ బెడ్‌లో ప్రతి రోజూజు (23 లక్షల ఎంఎల్‌డీ-మిలియన్ లీటర్ ఫర్ డే) నీటి సామర్థ్యంతో నీటిని అందిస్తున్నారు. ఇంటెక్‌వెల్ నుంచి మంచి నీటి శుద్ధజలం కేంద్రం వరకు 1.2 కిలో దూరంలో 240 పైపులను అమర్చారు. 2017 డిసెంబర్ నుంచి అన్ని గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. నియోజకవర్గంలో అనేక ఏజెన్సీ గ్రామాలున్నాయి. ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఐదు మండలాల్లోని 297 గ్రామాలకు నిత్యం నీటిని సరఫరా చేస్తున్నారు. 100 మంది సిబ్బందితో అన్ని గ్రామాలకు ట్యాంకుల నిర్వహణ, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.


కడెం జలాశయంలోని ఇంటెక్‌వెల్

**మూడు బ్యాలెనింగ్ ట్యాంకుల ద్వారా సరఫరా**

కడెం మండలకేంద్రంలోని ఇంటెక్‌వెల్ నుంచి 23 ఎంఎల్‌డీ వరకు (మంచినీటి శుద్ధి కేంద్రం) వరకు వెళ్లిన నీటిని అక్కడే ఫిల్టర్ చేసిన అధికారులు ఐదు మండలాల కోసం మూడు బ్యాలెనింగ్ వాటర్ ట్యాంకుల వరకు పంపిణీ చేస్తారు. అయితే ఇది కడెం మండలంలోని అంబారిపేట, ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి, పెంబి మండలంలోని నాగపూర్‌లో నిర్మించారు. అంబారిపేట, సత్తెనపల్లి గ్రామాల్లో నిర్మించిన బ్యాలెనింగ్ ట్యాంకుల కెపాసిటీ 250 కేఎల్ కాగా, పెంబి మండలంలోని నాగపూర్ ట్యాంకు కెపాసిటీ 40 కేఎల్. అయితే అంబారిపేట ట్యాంకు కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాలకు నీటిని సరఫరా చేస్తుండగా, సత్తెనపల్లి ట్యాంకు ద్వారా ఖానాపూర్ మున్సిపాలిటీతో పాటు, ఖానాపూర్ మండలానికి సరఫరా చేస్తున్నారు. అలాగే నాగపూర్ ట్యాంకు ద్వారా పెంబి మండలానికి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ మూడు ట్యాంకుల ద్వారా 297 గ్రామాల్లోని ట్యాంకులకు నిత్యం నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంకుల పరిమాణం పెద్దది కావడంతో మంచినీటి శుద్ధి కేంద్రం నుంచి ఈ ట్యాంకుల్లోకి చేరవేసి వాటి ద్వారా క్రమంగా గ్రామాల్లోని ట్యాంకులకు తరలిస్తున్నారు. ఈ 297 గ్రామాలను ఆపరేట్ చేయడానికి 100 మంది సిబ్బంది అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్నారు.


**నిత్యం నీటి సరఫరా**



కడెం మండల కేంద్రంలోని 23 ఎంఎల్‌డీ ద్వారా నిత్యం ఐదు మండలాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నాం. ఖానాపూర్ మున్సిపాలిటీతో సహా, ఐదు మండలాల్లోని 297 గ్రామాలకు తాగునీటి సరఫరా కొనసాగుతుంది. పైప్‌లైన్, ట్యాంకుల నిర్వహణ ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులతో పాటు, ఫిల్టర్‌కు సంబంధించిన పనులు మిషన్ భగీరథ సిబ్బంది ద్వారా నిత్యం పర్య వేక్షణతో చేపడుతున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరాను కొనసాగిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోయాయి.

- వెంకటరమణ, డీఈ, మిషన్ భగీరథ(కడెం)


కడెంలోని 20ఎల్ఎండీ మంచినీటి శుద్ధికేంద్రం


మిషన్ భగీరథ శుద్ధ జల కేంద్రం